## హైదరాబాద్‌లో నీటి ఎద్దడి నివారణకు చర్యలు..



**అక్షరటుడే, హైదరాబాద్:** హైదరాబాద్ నగర శివారు ప్రాంతాల్లో తాగునీటి కొరతతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ప్రభుత్వం నీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ప్రభుత్వం నియోపోలిస్ ప్రాంతంలో జల మండలికి 3.95 ఎకరాల భూమిని కేటాయించింది. భవిష్యత్ అవసరాల దృష్ట్యా ప్రభుత్వం గోదావరి తాగునీటి సరఫరా ప్రాజెక్ట్ ఫేజ్ 2, ఫేజ్ -3, మూసీ నది పునరుజ్జీవానికి ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ జలాశయాలను గోదావరి జలాలతో నింపడానికి అదనంగా 300 ఎంజీడీ నీటిని తరలించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

AKSHARA TODAY

# అక్షర టుడే

TOWARDS... TRUTH. TRUST. TREND

WWW.AKSHARATODAY.IN

## నమో అంటే.. నాయుడు, మోదీ: లోకేశ్



**అక్షరటుడే, ఏపీ:** కేంద్రంలో నరేంద్ర మోదీ.. ఏపీలో చంద్రబాబు నాయకత్వంలో అభివృద్ధి పరుగులు పెడుతోందని మంత్రి నారా లోకేశ్ అన్నారు. అనకాపల్లి జిల్లాలోని ఇండస్ట్రియల్ పార్కులో బ్లూజెట్ హెల్త్‌కేర్ లిమిటెడ్ పరిశ్రమకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ ఏపీకి బ్లూజెట్ సంస్థ రావడం శుభసూచికమన్నారు. ఏపీలో డబుల్ ఇంజిన్ సర్కారు కాదు.. డబుల్ ఇంజిన్ బుల్లెట్ ట్రెయిన్ సర్కారు నడుస్తోందని పేర్కొన్ఆనరు. నమో అంటే నరేంద్ర మోదీ అని అందరికీ తెలుసు. ఏపీలో నమో అంటే.. నాయుడు, మోదీ అని అంటారని చెప్పారు.

28-2-2026 (Saturday) MAIN EDITION

## భారీ పేలుడు.. 18 మంది మృతి



**అక్షరటుడే, ఏపీ:** ఆంధ్రప్రదేశ్‌లో భారీ పేలుడు చోటు చేసుకుంది. కాకినాడ జిల్లా వేట్లంపాడు, జి.మేడపాడు మధ్యలో ఉన్న బాణసంచా తయారీ పరిశ్రమలో పేలుడు సంభవించింది. ఈ ఘటనలో 18 మంది సజీవ దహనం అయినట్లు సమాచారం. పేలుడు దాటికి మృతదేహాలు ఎగిరిపడ్డాయని, మంటల్లో మరో 15 మంది చిక్కుకుని ఉంటారని స్థానికులు తెలిపారు.

## ప్రభుత్వానికి ఈటల సవాల్



**అక్షరటుడే, ఖమ్మం:** కబ్జాలు చేసిన పెద్దలను వదిలేసి కేవలం నిరుపేదల ఇళ్లు కూల్చివేయడం ఏమిటని ఎంపీ ఈటల రాజేందర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని అసైండ్, ఇనాం, భూదాన్ భూములు ఎవరి చేతుల్లో ఉన్నాయో లెక్కలు తీసే దమ్ము, ధైర్యం ఈ ప్రభుత్వానికి ఉందా అని సవాల్ విసిరారు. ఖమ్మం జిల్లా వెలుగుమట్ల కూల్చివేతల బాధితులను పరామర్శించారు.

## చంద్రబాబును కలిసిన భట్టి..



**అక్షరటుడే, ఏపీ:** ముఖ్యమంత్రి చంద్రబాబును తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క శుక్రవారం కలిశారు. తన కుమారుడు సూర్య విక్రమాదిత్య వివాహానికి సీఎంను ఆహ్వానించారు. ఈ మేరకు ఆహ్వాన పత్రిక అందజేశారు. భట్టి విక్రమార్క వెంట తెలంగాణ మంత్రి శ్రీధర్‌బాబు ఉన్నారు. వీరిద్దర్ని చంద్రబాబు సన్మానించారు.

## రూ.5,456 కోట్ల బడ్జెట్‌కు టీటీడీ బోర్డు ఆమోదం

**అక్షరటుడే, తిరుమల:** తిరుపతిలోని వకుళమాత ఆలయంలో గోవింద అక్షర మాల కార్యక్రమాన్ని ప్రారంభించాలని తితిదే నిర్ణయించింది. ఒంటిమిట్టలో 108 అడుగుల ఎత్తయిన జాంబవంతుడి విగ్రహ ఏర్పాటుకు రూ.20.17 కోట్లతో పనులు చేపట్టేందుకు టీటీడీ మండలి ఆమోదం తెలిపింది. అంతేకాకుండా రూ.5,456 కోట్ల తితిదే వార్షిక బడ్జెట్‌కు ఆమోదించింది. వార్షిక బడ్జెట్‌తోపాటు పలు కీలక అంశాలపై బోర్డు చర్చించింది. ధర్మకర్తల మండలి సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు మీడియాకు వెల్లడించారు. ఒంటిమిట్ట కోదండరామ కల్యాణానికి వచ్చే భక్తులకు ఉచిత లడ్డూ పంపిణీని బోర్డు ఆమోదించినట్లు పేర్కొన్నారు. గోవిందరాజస్వామి ఆలయం చుట్టూ సిమెంట్ రహదారి, డ్రెయిన్ల అభివృద్ధికి నిర్ణయించినట్లు చెప్పారు.

## మహిళా కానిస్టేబుల్ ఆత్మహత్య

**అక్షరటుడే, వికారాబాద్ :** వికారాబాద్ జిల్లాలో విషాదం చోటుచేసుకుంది. జిల్లా కేంద్రంలోని గంగారం సాయిబాబా కాలనీలో మహిళా కానిస్టేబుల్ ఆత్మహత్యకు పాల్పడింది. వివరాల్లోకి వెళ్తే.. వికారాబాద్‌లో పట్టణంలోని టౌన్ గంగారం సాయి బాబా కాలనీలో మహిళా కానిస్టేబుల్ దివ్య (28) నివాసం ఉంటోంది. కోటపల్లి పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తుండగా.. దారూర్ సీఐ కార్యాలయానికి అటాచ్‌గా పనిచేస్తున్న పనిచేస్తోంది. కాగా.. శుక్రవారం రాత్రి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



# ఇరాన్‌పై దాడులు

- క్షిపణులతో విరుచుకుపడిన ఇజ్రాయెల్, అమెరికా
- ఖమేనీ నివాసం సమీపంలో పేలుళ్లు
- ప్రతీకార దాడులకు దిగిన టెహ్రాన్
- మధ్యప్రాచ్యంలో యుద్ధ మేఘాలు

అమెరికా - ఇరాన్ మధ్య కొంతకాలంగా అణు ఒప్పందంపై చర్చలు జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ ఒప్పందం కుదరకపోవడంతో తాజాగా ఇరాన్‌పై ఇజ్రాయెల్, అమెరికా సంయుక్తంగా దాడులు చేశాయి. జూన్‌లో ఇజ్రాయెల్, ఇరాన్ 12 రోజుల వైమానిక యుద్ధంలో పాల్గొన్నాయి. అనంతరం రెండు దేశాలు సీజ్‌ఫైర్‌కు అంగీకరించాయి. ఇరాన్ తన అణు, బాలిస్టిక్ క్షిపణి కార్యక్రమాలతో ముందుకు సాగితే వారు మళ్లీ దాడి చేస్తామని అమెరికా - ఇజ్రాయెల్ పదేపదే హెచ్చరికలు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో తాజా వైమానిక దాడులు చోటు చేసుకున్నాయి.

### ముప్పును తొలగించడానికి..

తమ దేశానికి ముప్పును తొలగించడానికి ఇరాన్‌పై ముందస్తు దాడిని ప్రారంభించినట్లు ఇజ్రాయెల్ రక్షణ మంత్రి అన్నారు. కాగా.. ఇరాన్ అణ్వాయుధాలు సమకూర్చుకోవాలని చూస్తోంది. అయితే అమెరికా, ఇజ్రాయెల్ దానిని అడ్డుకుంటున్నాయి. ఈ విషయంలో ఏళ్లుగా వివాదం కొనసాగుతోంది. ఇందులో గతంలో ఇజ్రాయెల్ ఇరాన్‌లోని అణుస్థావరాలపై దాడులు చేసింది. ఆ సమయంలో రెండు దేశాలు దాడులు చేసుకున్నాయి. ఇరాన్ అణు ఆయుధాలను మళ్లీ తయారు చేస్తుందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అన్నారు. అమెరికా ప్రజలకు పొంచి ఉన్న ప్రమాదాన్ని ఎదర్కొనేందుకు దాడులు చేశామన్నారు.

**ఇరాన్‌పై ఇజ్రాయెల్ దాడులు చేసింది. శనివారం తెల్లవారు జామున పెద్ద ఎత్తున క్షిపణులను టెహ్రాన్‌పైకి ప్రయోగించింది. దీంతో ఇరాన్ బాంబుల మోతతో దద్దరిల్లింది. ఆ దేశ సుప్రీం లీడర్ ఖమేనీ లక్ష్యంగా దాడులు జరిగినట్లు తెలుస్తోంది. ఆయన నివాసానికి సమీపంలో పేలుళ్లు చోటు చేసుకున్నాయి. దీంతో అధికారులు ఖమేనీని సురక్షిత ప్రాంతానికి తరలించారు. దాడి అనంతరం ఇరాన్, ఇజ్రాయెల్ తమ ఎయిర్ స్పేస్‌లను మూసి వేశాయి. మరోవైపు టెహ్రాన్ సైతం ప్రతీకార దాడులకు దిగింది. దీంతో మధ్య ప్రాచ్యంలో యుద్ధ మేఘాలు అలుముకున్నాయి.**

**-అక్షరటుడే, నేషనల్ డెస్క్**

### 30 ప్రాంతాల్లో..

ఇజ్రాయెల్‌తో పాటు అమెరికా షీల్డ్ ఆఫ్ జూద్ పేరుతో ఆపరేషన్ నిర్వహించాయి. 30 ప్రాంతాలను లక్ష్యంగా చేసుకొని వైమానిక దాడులు చేపట్టాయి. నార్త్, ఈస్ట్ టెహ్రాన్‌పై బాంబుల వర్షం కురిపించాయి. చర్చలపై సంతృప్తిగా లేనని ట్రంప్ ప్రకటించిన కాసేపటికే దాడులు చోటు చేసుకోవడం గమనార్హం. తన మాటల్ని ఇరాన్ పట్టించుకోవడం లేదని ట్రంప్ పేర్కొన్నారు.

### భారత్ అడ్వైజరీ

ఇజ్రాయెల్‌లో ఉంటున్న భారత పౌరులకు కేంద్ర ప్రభుత్వం అడ్వైజరీ జారీ చేసింది. ఆ దేశ అధికారులు జారీ చేసే భద్రతా మార్గదర్శకాలను అనుసరించాలని సూచించింది. సురక్షిత ప్రదేశాల్లో ఉండాలని, అవసరమైతే తప్పా ప్రయాణాలు చేయొద్దని పేర్కొంది. సహాయం కోసం భారత ఎంబసీని సంప్రదించాలని సూచించింది. ఇరాన్ ప్రతీకార దాడులతో ఇజ్రాయెల్ ఎయిర్ స్పేస్ మూసి వేసింది. దీంతో ఢిల్లీ నుంచి టెల్ అవీవ్ బయలుదేరిన ఎయిరిండియా విమానం వెనక్కి వచ్చింది. రెండు దేశాల్లోని భారతీయులు సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని కేంద్రం సూచించింది. హెల్ప్‌లైన్ నెంబర్లు ఏర్పాటు చేసింది. మరోవైపు దాడులతో ఇరాన్‌లో మొబైల్, ఇంటర్నెట్ సేవలు నిలిచిపోయాయి.

### క్షిపణులు ప్రయోగించిన ఇరాన్

తమపై దాడికి ఇరాన్ స్పందించింది. ఇజ్రాయెల్‌తో పాటు గల్ఫ్ దేశాల్లోని అమెరికా స్థావరాలపై దాడులకు దిగింది. బహ్రెయిన్‌లో పేలుళ్లు జరుగుతున్నట్లు తెలిసింది. ఇరానియన్ క్షిపణిని పేట్రియాట్ రక్షణ వ్యవస్థ అడ్డగించిందని ఖతార్ రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపింది. ఇరాన్‌కు చెందిన ఒక సీనియర్ అధికారి మాట్లాడుతూ "రాబోయే దానికి సిద్ధంగా ఉండండి, మా ప్రతిస్పందన బహిరంగంగా ఉంటుంది"అని హెచ్చరించారు.

## హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ ప్రారంభించిన ప్రధాని మోదీ



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ హెచ్‌పీవీ వ్యాక్సినేషన్‌ను ప్రారంభించారు. 14 ఏళ్లు నిండి 15 ఏళ్లలోపు బాలికలకు వ్యాక్సిన్ ఇవ్వనున్నారు. ఇందులో భాగంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శనివారం రాజస్థాన్‌లోని అజ్మీర్‌లో పర్యటించారు. ఇందులో భాగంగా 14 ఏళ్ల బాలికలకు దేశవ్యాప్తంగా హ్యూమన్ పాపిల్లోమా వైరస్ టీకా ప్రచారాన్ని ప్రారంభించారు. ఇది గర్భాశయ క్యాన్సర్‌ను నివారించే లక్ష్యంతో తయారు చేశారు. మహిళల్లో క్యాన్సర్ సంబంధిత అనారోగ్యానికి ప్రధాన కారణాలలో ఒకటైన ఈ కార్యక్రమాన్ని లక్ష్యంగా చేసుకుని వ్యాక్సినేషన్ చేపట్టనున్నారు.

## ఆడబిడ్డల ఆరోగ్యాన్ని కాపాడేందుకు వ్యాక్సినేషన్: పొన్నం





**అక్షరటుడే, హైదరాబాద్ :** హైదరాబాద్ నగరంలోని కింగ్ కోఠి హాస్పిటల్‌లో హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ డ్రైవ్‌ను ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ప్రారంభించారు. వ్యాక్సిన్ వేయించుకున్న బాలికలకు ఆయన సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఈ రోజు ఆరోగ్య రంగంలో చారిత్రాత్మక ఘట్టం అన్నారు. ఆడబిడ్డల ఆరోగ్యాన్ని కాపాడేందుకు ఒక బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. మారుతున్న జీవనశైలి, ఆహారపు అలవాట్లు, కాలుష్యం వంటి కారణాలతో దేశవ్యాప్తంగా క్యాన్సర్ విస్తరిస్తోందని చెప్పారు. రాష్ట్రంలో ఏటా 55 వేల నుంచి 60 వేల క్యాన్సర్ కేసులు నమోదవుతున్నాయని వెల్లడించారు. క్యాన్సర్ మహమ్మారిని ఎదుర్కోవడానికి రాష్ట్ర ప్రభుత్వం ఒక సమగ్ర పాలసీని రూపొందించిందని మంత్రి తెలిపారు.

## కూలిన విమానం.. 15 మంది దుర్మరణం..



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** బొలీవియాలో విషాదం చోటుచేసుకుంది. ఇక్కడి ఎల్ ఆల్టో అంతర్జాతీయ విమానాశ్రయం సమీపంలో రద్దీగా ఉండే రహదారిపై బొలీవియన్ ఎయిర్ ఫోర్స్ విమానం కూలిపోయింది. ఈ ప్రమాదంలో 15 మంది మరణించారు. పదుల సంఖ్యలో గాయపడ్డారు. బొలీవియా రాజధాని లా పాజ్‌కు ఆనుకుని ఉన్న ఎల్ ఆల్టో నగరంలో శుక్రవారం సాయంత్రం 6 గంటల ప్రాంతంలో ఈ ప్రమాదం సంభవించింది. సౌత్ అమెరికన్ - గ్లోబల్ డిఫెన్స్ డెవలప్‌మెంట్‌లను ట్రాక్ చేసే ఎస్‌ఏ డిఫెన్సా 'ఎక్స్' పోస్ట్ ద్వారా ఈ ప్రమాద ఘటనను షేర్ చేసింది. విమానాశ్రయం సమీపంలో బొలీవియన్ ఎయిర్ ఫోర్స్ సీ130 హెర్క్యులస్ కూలిపోయిందని సదరు పోస్ట్ వెల్లడించింది.

## కోహ్లి రికార్డును బ్రేక్ చేసిన రష్మిక..



**అక్షరటుడే, సినిమా డెస్క్:** విజయ్ దేవరకొండ - రష్మిక మందనా వివాహ బంధంలోకి అడుగుపెట్టిన విషయం తెలిసిందే. వీరి పెళ్లి వేడుక రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్ అంగరంగ వైభవంగా జరిగింది. అయితే ఈ విరోష్ జోడి పెళ్లికి సంబంధించిన ఇన్‌స్టాగ్రామ్ పోస్టులు రికార్డులు సృష్టిస్తున్నాయి. తన పెళ్లి ఫొటోలను రష్మిక పోస్టు చేయగా దానికి 23 మిలియన్ల లైక్స్ వచ్చాయి. తొలి 24 గంటల్లోనే దాదాపు 18 మిలియన్ల లైక్‌లను దాటింది. ఇక విజయ్ దేవరకొండ పోస్ట్ దాదాపు 15 మిలియన్ల లైక్‌లతో దగ్గరగా ఉందని సమాచారం. ఇప్పటివరకూ ఈ రికార్డు కోహ్లి పేరిట ఉండేది. కాగా.. టీ20 వరల్డ్ కప్ గెలిచిన తర్వాత కోహ్లీ చేసిన పోస్టుకు 22.9 మిలియన్ల లైక్స్ వచ్చాయి. వీటి తర్వాత ఐపీఎల్ గెలిచాక కోహ్లి పోస్టు 19.8 మిలియన్లు, రిటైర్మెంట్ పోస్ట్ (19.7 మిలియన్లు) ఉన్నాయి.

## సీట్లపై డీఎంకేతో కాంగ్రెస్ చర్చలు

**అక్షరటుడే, చెన్నై:** తమిళనాడులో అధికార డీఎంకే, కాంగ్రెస్ పార్టీల మధ్య సీట్ల పంపకంపై ప్రాథమికంగా చర్చలు మొదలయ్యాయి. ఏ క్షణంలోనైనా ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించే అవకాశం ఉంది. దీంతో ఇప్పటినుంచే సీట్ల పంపకంపై రెండు పార్టీలు కసరత్తు ప్రారంభించాయి. ఏఐసీసీ తమిళనాడు ఇన్‌ఛార్జి గిరీష్ చోదంకర్, టీఎన్‌సీసీ చీఫ్ సెల్వపెరుంతగై, ఏఐసీసీ కో ఇన్‌ఛార్జి నివేదితా డీఎంకే రాష్ట్ర కార్యాలయానికి చేరుకున్నారు. డీఎంకే సీనియర్ నేత టీఆర్ బాలు నేతృత్వంలోని ప్యానెల్‌తో చర్చలు చేపట్టారు. తమిళనాట 2021 అసెంబ్లీ ఎన్నికల్లో 25 స్థానాలకు కాంగ్రెస్ పోటీ చేసింది. ఈసారి కనీసం 35 స్థానాలు తమకు కేటాయించాలని, రెండు రాజ్యసభ స్థానాలు ఇవ్వాలని కోరుతున్నట్లు తెలుస్తోంది. మరోవైపు డీఎంకే మాత్రం 27, 28 స్థానాలు, ఒక రాజ్యసభ సీటును ఆఫర్ చేసేందుకు సుముఖంగా ఉన్నట్లు సమాచారం.

## తాప్సీ హాట్ కామెంట్స్

**హీరోయిన్ తాప్సీ పన్ను తరచూ సంచనల వ్యాఖ్యలతో వార్తల్లో నిలుస్తుంటారు. తాజాగా ఆమె ఆసక్తిక వ్యాఖ్యలు చేశారు. తనతో సినిమాలు చేసేందుకు చాలామంది హీరోలు వెనకడుగు వేశారని చెప్పారు. కారణాలు తెలీదు కానీ తనతో చేయను అనేవారన్నారు. దీంతో కొన్ని అవకాశాలు చేజారిపోయాయని తాప్సీ చెప్పుకొచ్చారు. తనతో పని చేయడం కష్టమనే రూమర్ ఉందని ఆమె పేర్కొన్నారు. ఈ ముద్దుగుమ్మ నటించిన 'అస్సి' అనే హిందీ సినిమా ఇటీవల విడుదలైంది.**

**—అక్షరటుడే, సినిమా డెస్క్**

